

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 20.06.2026 | సంపుటి: 3 | సంచిక: 138 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 20.06.2026 | V0LUME : 3 | ISSUE : 138 | PAGES: 8 | COST: 2/- |

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

# తెలంగాణలో ధాన్యం నిల్వకు అత్యాధునిక సైలోలు..

23 జిల్లాల్లో 82 ఆధునిక సైలో టెర్మినల్స్ ఏర్పాటు
47.5 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం లక్ష్యం
రూ.4,450 కోట్లతో భారీ ప్రాజెక్టుకు ప్రణాళిక



**హైదరాబాద్, జూన్ 19 (రాజముద్ర న్యూస్):** రాష్ట్రంలో ధాన్య కొనుగోలు, నిల్వ వ్యవస్థను మరింత ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. రైతులు పండించిన ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో భద్రపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక సైలో టెర్మినల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ అంశంపై సచివాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 23 జిల్లాల్లో మొత్తం 82 సైలో టెర్మినల్స్ నిర్మించేందుకు

మిగతా 2వ పేజీలో..




## తెలంగాణ భవిష్యత్తుకు విద్యే పునాది

- 60 ఏళ్ల పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం
- విద్యాశాఖకు రూ.26,600 కోట్ల కేటాయింపు
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థుల ప్రతిజ్ఞ
- ఒలింపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు
- 119 యంగ్ ఇండియా పాఠశాలలతో విద్యలో విప్లవం

**హైదరాబాద్, జూన్ 19 (రాజముద్ర న్యూస్):** తెలంగాణ రాష్ట్రం భాషా ప్రయుక్త రాష్ట్రంగా గానీ, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడలేదని, 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, త్యాగాలు, ఆత్మబలిదానాల ఫలితంగానే తెలంగాణ ఆవిర్భవించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత పదేళ్లలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను వికాసం దిశగా తీసుకెళ్తున్నామని

మిగతా 2వ పేజీలో..

**కార్పొరేట్ కు పోటీగా ప్రభుత్వ స్కూళ్లు** 2

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

అనుమతులిస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ
రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత
సీఎం రేవంత్ రెడ్డి హర్షం
కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు

3



## మన వనరులే మన పెట్టుబడి

- సంపద సృష్టి దిశగా అడుగులు
- పొరుగు రాష్ట్రాలకు ఇసుక ఎగుమతిపై అధ్యయనం
- పీపీపీ మోడల్ పర్యాటక ఆస్తుల అభివృద్ధి
- టెంపుల్, ఎకో, హెల్త్ టూరిజంపై దూకుడు
- వీకెండ్స్ లో హెలికాప్టర్ పర్యటకానికి ప్రణాళికలు
- పర్యాటకం, రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3





## భూ వివాదాలు లేని రాష్ట్రమే లక్ష్యం

- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

3

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక, విశ్వాస ఘాతుక ప్రభుత్వం
రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ
రైతులపై విషం కక్కిన సిఎం రేవంత్ రెడ్డి
మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ రావు విమర్శలు

2



## హామీలను విస్మరించిన కాంగ్రెస్



- మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి
- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు
- మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు

2



## చిన్నారుల ఆరోగ్యం, ఆనందమే అసలైన అభివృద్ధి

- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- చాంద్రాయణగుట్టలో అంగన్‌వాడీ-కమ్-పాలన కేంద్రం ప్రారంభం

2



3

## అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

- సోమవారం వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం



## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

3

- స్కూల్ పిల్ల భద్రత యాజమాన్యాలదే బాధ్యత
- యాజమాన్యాలతో భేటీఓ సీపీ సజ్జనార్

## ఫేక్ ఐడీలతో యువతులకు టోకరా

- పెళ్లి పేరుతో రూ.12 లక్షలు, బంగారం కాజేసిన యువకుడు
- ఐపీఎస్, ఎంబీబీఎస్ విద్యార్థినంటూ నమ్మించిన కేటుగాడు

3





## మీనాక్షి నటరాజన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్

2

- ప్రతివాదుల జాబితాలో ఏడుగురు
- త్వరలో విచారణ చేపట్టనున్న న్యాయస్థానం



## సోలార్ రూఫ్ టాప్ టెండర్ల నిబంధనలు మార్చాలి

- కేటీఆర్‌కు టీఎస్ ఈపీ ప్రతినిధుల విజ్ఞప్తి

3

# కార్పొరేట్ కు పోటీగా ప్రభుత్వ స్కూళ్లు



- 27 లక్షల మంది విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ
- రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 19 :**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రభుత్వం ఒక చరిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 27 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన వస్తువులతో కూడిన విద్యా కిట్లను పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇది కేవలం ఒక రోజువారీ ప్రభుత్వ కార్యక్రమం కాదని, దశాబ్దాలుగా ఉన్న విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు, విద్యార్థుల ఆత్మగౌరవానికి ప్రతీక అని డిప్యూటీ సీఎం అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా కిట్లను ప్రజాప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఈ కిట్‌లో అందించే బూట్లు, యూనిఫామ్, పుస్తకాలు, బెడ్ షీట్స్ వంటి ప్రతీ వస్తువును అత్యంత నాణ్యతతో రూపొందించినట్లు ప్రకటించారు. గత ప్రభుత్వాల మాదిరిగా మొక్కుబడిగా కాకుండా ప్రజాధనంలోని ప్రతి పైసాకు జవాబుదారీతనంగా ఈ వస్తువులను విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఒక తండ్రిలా బాధ్యత తీసుకొని ఈ కిట్లను అందిస్తున్నారన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న యూనిఫామ్ కేవలం ఒక వస్త్రం ముక్క కాదు.. తాము ఇస్తున్న బూట్లు కేవలం కాళ్లకు వేసుకునేవి కావు.. అవి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సమాజంలో మేమెవరికీ తక్కువ కాదని ధైర్యంగా, సగర్వంగా తల ఎత్తుకుని తిరిగేలా చేసే ఆత్మగౌరవ ప్రతీకలుగా ఆయన అభివర్ణించారు.

**ప్రపంచంతో పోటీ పడేలా యంగ్ ఇండియా స్కూల్స్**

విద్యా బుద్ధులతోపాటు విద్యార్థుల ఆహార్యం, మౌలిక వసతులు కూడా అంతర్జాతీయ స్థాయిలో ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, ఇందులో భాగంగానే ఒక్కొక్క ఇంటిగ్రేటెడ్ పాఠశాలను రూ.200 కోట్ల భారీ వ్యయంతో ప్రపంచ □థయి వసతులతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒకేసారి వంద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేసిందని భట్టి చెప్పారు. ఇటీవలే ఆరుట్ల గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభమైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ దీనికి సజీవ సాక్ష్యం. అక్కడ నిర్మించిన అత్యాధునిక కిచెన్ ఏ కార్పొరేట్ స్కూల్లోనూ లేని విధంగా ఉందన్నారు. భవిష్యత్తులో ని ప్రభుత్వ పాఠశాలలన్నీ ఇదే రీతిన మారబోతున్నాయని చెప్పారు.

**విపక్షాలపై ఘాటు విమర్శలు**

రాష్ట్రంలో పేద, బలహీనవర్గాల పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున సంస్కరణలు చేపడుతుంటే ప్రతిపక్ష నాయకులు అవాకులు చవాకులు పేలడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణను చూసి, ప్రపంచంతో పోటీపడుతున్న విద్యార్థులను చూసి అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు.

**నిరంతరాయంగా విద్యా యజ్ఞం**

ఈ విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమం ఇందిరమ్మ ప్రభుత్వానికి అత్యంత ప్రియమైనదని, ఇది నిరంతరాయంగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు, తెలంగాణ సమాజానికి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ భవిష్యత్తుకు విద్యే పునాది: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసిన అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖల స్టాళ్లను పరిశీలించిన ఆయన, మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు అంటే రూ.26,600 కోట్లను విద్యాశాఖకు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు. గత పాలనలో విద్యారంగానికి వందేళ్ల నష్టం జరిగిందని విమర్శించారు. విద్యార్థుల డైట్ ఛార్జీలను పదేళ్లుగా, ఇతర భత్యాలను పదహారేళ్లుగా పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని పెంచినట్లు తెలిపారు. విద్యారంగ ప్రక్షాళన కోసం విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని చెప్పారు.





విద్యార్థుల తలరాతను మార్చేది తరగతి గదులేనని పేర్కొన్న సీఎం, తెలంగాణ యువత దేశానికే ఆదర్శంగా నిలవాలంటే విద్యను ఇష్టపడి అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వ విద్యే దేశాభివృద్ధికి బలమైన పునాది కావాలని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు.

దేశ జనాభా 140 కోట్లకు పైగా ఉన్నప్పటికీ ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో స్వర్ణ పతకాలు సాధించలేకపోవడం పాలకుల వైఫల్యమని వ్యాఖ్యానించారు. అందుకే తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమన్నారు.

కృత్రిమ మేధ ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాల్లో మార్పులు వస్తున్నాయని, నైపుణ్యాలు ఉన్న వారికి మాత్రం అవకాశాలు విస్తృతంగా ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా 119 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ రంగంలో అందించడమే లక్ష్యమని చెప్పారు.

ఇటీవల ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో అన్ని సీట్లు నిండిపోయాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం పరిమితులు విధించే స్థాయికి విద్యా వ్యవస్థను తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నతాధికారులుగా ఎదగాలని, తెలంగాణను దేశంలోనే విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

# హామీలను విస్మరించిన కాంగ్రెస్

**హైదరాబాద్,జూన్ 19:**

రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారన్నారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షిణ్యంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ దిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు, బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## మీనాక్షి నటరాజన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్

**హైదరాబాద్, జూన్ 19:**

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌పై ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు పిటిషన్ దాఖలైంది. నారాయణపేట జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత కంభం శివకుమార్ రెడ్డి తనను వేధించడంతో పాటు ప్రాణహాని బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ శ్రీలత అనే మహిళ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

గతంలో ఇదే అంశంపై నాంపల్లి కోర్టును ఆశ్రయించిన శ్రీలత పిటిషన్‌ను ఆ కోర్టు విచారించింది. అయితే ఈ కేసు తమ పరిధిలోకి రాదని పేర్కొంటూ పిటిషన్‌ను తిరిగి ఇచ్చేసింది. సంబంధిత అంశాన్ని ప్రజాప్రతినిధుల కోర్టులో దాఖలు చేయాలని సూచించింది.

దీంతో తాజాగా శ్రీలత ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో మీనాక్షి నటరాజన్‌తో పాటు మరో ఏడుగురిని ప్రతివాదులుగా చేర్చారు.కంభం శివకుమార్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పార్టీ అధిష్ఠానం స్పందించలేదని పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆరోపణలపై ప్రజా ప్రతినిధుల కోర్టు త్వరలో విచారణ చేపట్టనుంది. పిటిషన్‌పై న్యాయస్థానం ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తుందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# తెలంగాణలో ధాన్యం నిల్వకు అత్యాధునిక సైలోలు..

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

ఈ ప్రాజెక్టు ద్వారా 47.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య నిల్వ సామర్థ్యాన్ని సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని దీర్ఘకాలం నాణ్యత దెబ్బతినకుండా భద్రపరచేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది.

ప్రస్తుతం అమలులో ఉన్న సంప్రదాయ నిల్వ విధానాల్లో వర్షాలు, తేమ, పురుగులు, ఇతర ప్రకృతి ప్రభావాల వల్ల ధాన్యం నష్టపోయే అవకాశం ఉంటుంది. అయితే సైలోల ద్వారా ధాన్యాన్ని పూర్తిస్థాయిలో రక్షించవచ్చని అధికారులు వివరించారు. అత్యాధునిక సాంకేతికతతో నిర్మించే ఈ నిల్వ కేంద్రాలు వాతావరణ ప్రభావాలకు తట్టుకునే విధంగా ఉండటంతో పాటు ధాన్య నాణ్యతను ఎక్కువకాలం కాపాడుతాయి.

రాష్ట్రవ్యాప్తంగా స్వయంచాలక, వాతావరణ నిరోధక ధాన్య నిల్వ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ధాన్యం నిల్వ, రవాణా, పంపిణీ ప్రక్రియలు మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. అవసరమైన సమయంలో నిల్వ ధాన్యాన్ని వేగంగా పంపిణీ చేయడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరు కూడా మెరుగుపడనుంది.

సైలోల నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, ఆర్థిక అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సుమారు రూ.4,450 కోట్ల వ్యయంతో ఈ భారీ ప్రాజెక్టును అమలు చేసే అవకాశాలపై అధికారులు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు తమ ప్రతిపాదనలు సమర్పించారు. ప్రాజెక్టు అమలు విధానం, నిర్వహణ, పెట్టుబడి నమూనాలపై ప్రభుత్వం పరిశీలన కొనసాగిస్తోంది.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖను దేశంలోనే ఆదర్శవంతమైన ఆధునిక ధాన్య నిర్వహణ వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన బియ్యం అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆధునిక సైలోల ఏర్పాటు ద్వారా ధాన్యం నిల్వలో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు నిల్వ సమయంలో జరిగే నష్టాలు గణనీయంగా తగ్గుతాయని అధికారులు వెల్లడించారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం పెరిగి రాష్ట్ర ఆహార భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ ధాన్య నిల్వ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.



# చిన్నారుల ఆరోగ్యం, ఆనందమే అసలైన అభివృద్ధి

**హైదరాబాద్, జూన్ 19 :**

చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని అరుంధతి నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం కమ్‌పాలన(డే కేర్) కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి వారి అభ్యాస ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో తొలి పాలన కేంద్రాన్ని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సు గల చిన్నారులకు సంరక్షణ, పోషకాహారం, ఆటల ద్వారా అభ్యాసం అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం, పాలన కేంద్రాన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఒకే కుటుంబంలోని చిన్నారులకు సమగ్ర సేవలందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉపాధి కోసం బయటకు వెళ్లే తల్లులకు ఈ డే కేర్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, పిల్లల సంరక్షణ కోసం మహిళలు తమ ఉద్యోగాలు, ఉపాధిని వదులుకోవాల్సిన పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని అన్నారు. చిన్నారి జీవితంలోని మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఆ దశలో మెదడు ఎదుగుదలతోపాటు శారీరక, మానసిక వికాసం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అందుకే గర్భధారణ దశ నుంచి తొలి రెండేళ్ల వరకు తల్లులు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సేవలు, సంరక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రైవేట్ నర్సరీలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతూ 57 రకాల ఆట వస్తువులు, యూనిఫాంలు, నాణ్యమైన ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఆరేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ పట్టణ ప్రాంతాల్లో కూడా మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, టీనేజ్ బాలికల కోసం ప్రత్యేక మహిళా సంఘాలను



ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేదరిక నిర్మూలనతోపాటు నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అమ్మకు అక్షర మాల కార్యక్రమం ద్వారా ఇప్పటికే ఆరు లక్షల మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని మంత్రి సీతక్క చెప్పారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, ఎస్బీఐ ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యూష్ మెహ్రోత్రా అధ్యక్షుడు, ఎస్‌బీఐ ఫౌండేషన్ రాజారాం చవాన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, ఎస్‌బీఐ ఫౌండేషన్ రుద్రాణి గుహ, అసిస్టెంట్ మేనేజర్ (శిశు అభివృద్ధి) పాల్గొన్నారు.

# కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

**సిద్దిపేట, జూన్ 19:**

కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని..కానీ మీది విశ్వాసం లేని కేబినెట్, విశ్వాసఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను సీఎం బొందపెట్టారని విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా అని నిలదీశారు. దళారుల దయాదక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని, మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడతారని, మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. 45 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు బంధు ఇస్తామన్నారని, 90 రోజులు అయ్యిందని, ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 202425 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు. రైతుబంధు కింద కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ.29,358 కోట్లు బకాయి పడ్డిందని అన్నారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఆయన ప్రశ్నించారు. దీనిపై చర్చకు ఏ ఊరుకైనా పోదాం వస్తారా అని మంత్రులకు సవాల్ విసిరారు. రాష్ట్రంలో 7,600 మందికి బీమా రాలేదని గణాంకాలతో హరీష్ రావు వివరించారు. ఎందుకు బీమా రావడం లేదంటే ప్రభుత్వం ప్రీమియం కట్టలేదన్నారని చెప్పారు. గురువారం మీరు కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని పంటలు యథావిధిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్ సర్కార్‌ను హరీష్ రావు డిమాండ్ చేశారు.

# మన వనరులే మన పెట్టుబడి

**హైదరాబాద్, జూన్ 19:**

ప్రభుత్వానికి ఆదాయ వనరులు తీసుకువచ్చే రంగాలపై పూర్తిగా దృష్టి పెట్టాలని ఉప ము ఖ్య మంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. మన వనరులే మన పెట్టుబడి అని ఆయన అన్నా రు. ఆదాయ వనరుల సమీకరణపై మంత్రివర్గ ఉప సంఘం సచివాలయంలో శుక్రవారం సమావేశమైంది. సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భం గా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక కేంద్రాల్లోని ప్రభుత్వ భూములు, స్థలాలను సమ ర్థవంతంగా వినియోగించి ఖజానాకు ఆదాయా న్ని తీసుకురావాలని సూచించారు. గోవా, కేరళ వంటి రాష్ట్రాలు పర్యాటకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నాయని చెప్పారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజలకు ఉపాధిని కల్పించడ మేకాక జీడీపీ పెరుగుదలకు టూరిజం ఉపయో గపడుతోందని చెప్పారు. మన రాష్ట్రంలోనూ టూరిజాన్ని అలగే అభివృ ద్ధి చేయాలని అధికా రులకు సూచించారు.టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం రంగాల్లో మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. వారాంతాల్లో హెలీకాప్టర్ టూరిజాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. శ్రీ శైలం, నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ లో ప ర్యటకాన్ని అభివృద్ధి చేసే ప్రాజె క్టులు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో టూరిజం ఆస్తు లు పూర్తి స్థాయిలో వినియోగంలో లేవన్నా రు. వాటిని పీపీపీ మోడల్లో అభివృద్ధి చేసి సంపద సృష్టించాలని సంబంధిత అధికారు లకు ఆయన సూచనలు చేశారు. ఆదాయ సమీకరణలో పర్యాటక ప్రాం తాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి లక్ష్యా ల సాధనలో పర్యాటకం కీలక పాత్ర పోషి స్తుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏకో టూరిజం, హెల్త్ టూరిజం, టెంపుల్ టూరి జంలో అవకాశాలను ఆయన ప్రత్యేకంగా ప్ర స్తావించారు. పీపీపీ ఆధారిత సమగ్ర పర్యాటక అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కేబినెట్ ముందుంచాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన విధానపరమైన అంశాలను కేబినెట్ ముందుంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పూడికతీత పనులపై కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష చేసింది. చట్టపరమైన నిబంధన లు పాటించే క్రషర్లకు అనుమతులు ఇవ్వాలని సబ్ కమిటీ అభిప్రాయపడింది.

**లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ పై సమీక్ష**

లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులపై కేబినెట్ పబ్ కమిటీ సమీక్ష చేసింది. చరంగా నిబంధనలు పాటించే క్రషర్ల నిర్వాహకులకు అనుమతులు ఇవ్వాలని సబ్ కమిటీ సూత్రప్రా యంగా నిర్ణయించింది. నది ఇసుకతో పోలిస్తే రోబో శాండ్ తక్కువ ధరకు లభిస్తోందని సబ్ కమిటీ గుర్తించింది. ఇరుగు పొరుగు రాష్ట్రాలకు ఇసుకను ఎగుమతి చేయడంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య గణ నీయంగా పెరిగిందని అధికారులు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా స్లాబ్ అధారిత భూముల విలువ సవరణ వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయ ని చెప్పారు. రవాణా శాఖకు సంబంధించి ఆదాయం, వసూళ్లు పెంచేలా తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సబ కమిటీ సకమీక్ష చేసింది. అందులో భాగంగా బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ల విషయంలో పన్నులపై రాష్ట్ర అధికారాన్ని సమ ర్థిస్తూ కేరళకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చి నట్లు సబ్ కమిటీ గుర్తించింది. భారత్ సిరీస్ రిజిస్ట్రేషన్లపై చట్టపరమైన, విధానపరంగా తీసుకోవల్సిన అంశాలపై సబ్ కమిటీ చర్చించింది. బీహెచ్ సిరీస్ పన్నుల అంశంపై చర్చించేందు కు దక్షిణాది రాష్ట్రాల రవాణా మంత్రుల సమా వేశాన్ని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖకు సంబంధించి పారిశ్రామిక భూముల క్రమబద్ధీ కరణ కార్యక్రమాల ద్వారా ఆదాయ సమీకరణను సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, తెలంగాణ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేష న్ వైస్ ఛైర్మన్ఎండీ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, ట్రాన్స్ పోర్ట్ కమిషన్ ఇళాంభర్తి, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్. శ్రీధర్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వాణి ప్రసాద్, ఇండస్ట్రీస్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ ఆదిత్య, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్ పాల్గొన్నారు.

## నాలెడ్జ్ సిటీ భూముల వివాదం..

- **ఎస్‌బీఐపై ప్రభుత్వం ఆగ్రహం**
- **హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన బ్యాంకు***

**హైదరాబాద్, జూన్ 19:**

రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిధిలోని 5.09 ఎకరాల ప్రభుత్వ భూముల వేలం వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఈ భూమిపై తమకూ హక్కు ఉందంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం తో ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. 2010లో రూ.13.33 కోట్లకు ఈ భూమిని కొనుగోలు చేశామని, ఇటీవల ప్రభు త్వం వేలం వేసిన భూమిలో కొంతభాగం తమ పరిధిలోనిదేనని పేర్కొంటూ ఎస్‌బీఐ హైకోర్టు లో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నాలెడ్జ్ సిటీ భూముల వేలం వివాదాస్పదంగా మారింది.గత మే 28న సర్వే నంబర్ 83/1లోని ప్రభుత్వ భూములను తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ వేలం వేయగా, గౌరా వెంచర్స్ ఎకరానికి రూ.237 కోట్ల చొప్పున అత్యధిక ధరకు భూమిని సొంతం చేసుకుంది. ఈ వేలం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిం ది.అయితే వేలం పూర్తయిన తర్వాత భూమిపై హక్కులు ఉన్నాయని ఎస్‌బీఐ కోర్టును ఆశ్ర యించడం ప్రభుత్వానికి షాక్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో భూముల వేలానికి సంబంధిం చిన నిబంధనలను ఎస్‌బీఐనే ఉల్లంఘించిందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ వివాదం నేపథ్యంలో ప్రభుత్వానికి, ఎస్‌బీఐకి మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలపై సమీక్ష చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎస్‌బీఐలో ఉన్న ప్రభుత్వ డిపాజి ట్లు, వివిధ శాఖల ఖాతాల వివరాలను సేకరిస్తున్న ట్లు సమాచారం. అవసరమైతే ప్రభుత్వ ఖాతాలను ఇతర బ్యాంకులకు బదిలీ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగు తోంది. భూముల యాజమాన్యంపై తుది నిర్ణయం హైకోర్టు విచారణ అనంతరం వెలువడనుండగా, ఈ వివాదం ప్రభుత్వంఎస్‌బీఐ మధ్య కొత్త ఉద్రిక్తత లకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సోలార్ రూఫ్ టాప్ టెండర్ల నిబంధనలు మార్చాలి

**హైదరాబాద్, జూన్ 19:**

రాష్ట్రంలోని సుమారు పది వేల ప్రభుత్వ పాఠశాలల్లో 2 కిలోవాట్, 3 కిలోవాట్, 5 కిలోవాట్ రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు కోసం ఇటీవల విడుదల చేసిన టెండర్‌లో కనీస వార్షిక టర్నోవర్ ₹150 కోట్లు ఉండాలి, అలాగే ఒకే సంవత్సరంలో 25 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను అమలు చేసిన అనుభవం ఉండాలి అనే అర్హత ప్రమాణాలు విధించారు.. ఈ నిబంధనల కారణంగా ఎన్నో సంవత్సరాలుగా విజయ వంతంగా రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులను అమలు చేస్తున్న స్థానిక సోలార్ ఎంఎస్ ఎంఈలు దాదాపు పూర్తిగా అనర్హులుగా మారుతున్నారని సోలార్ ఎనర్జీ అసోసియే షన్ (టీఎస్ ఈఏ) ప్రతినిధులు పేర్కొన్నారు. ఈమేరకు వారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం కలిసి తమ సమస్యను విన్నవించారు. గత దశాబ్ద కాలంలో రాష్ట్రంలో వార్షిక రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్లు చాలా సందర్భాల్లో 20 మెగావాట్లను కూడా మించలేదు. అలాంటి పరిస్థితిలో ఈ టెండర్ నిబంధనలు కొద్దిమంది పెద్ద సంస్థలకు, ముఖ్యంగా రాష్ట్రానికి వెలుపల ఉన్న కంపెనీ లకు మాత్రమే అనుకూలంగా రూపొందించి నట్లు కనిపిస్తున్నాయి. దీంతో తెలంగాణ పారి శ్రామికవేత్తలు తమ సొంత రాష్ట్రంలో అమలు అవుతున్న ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోతున్నారు. ఇంతకుముందు విడుదలైన పాఠశాల సోలార్ టెండర్ కూడా రాష్ట్రానికి వెలుపల ఉన్న కంపెనీలకే కేటాయించబడిం ది. అయితే సంవత్సరం గడిచినప్పటికీ ఆ ప్రా జెక్టు అమలులో ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేదని సమాచారం. స్థానిక పరిశ్రమ సామర్థ్యాలను వినియోగిస్తూ భాగస్వామ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉన్న సమయంలో, కొత్త టెండర్ మరింత కఠినమైన అర్హత ప్రమాణాలతో స్థానిక సంస్థలకు అడ్డంకులు సృష్టిస్తోందని వివరించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి సానుకూల స్పందన లభించలేదు. అందువల్ల నాణ్యత ప్రమాణాలను కాపాడుతూ తెలంగాణకు చెందిన సోలార్ సంస్థలు కూడా పోటీ పడగలిగే విధంగా టెండర్ అర్హత ప్రమా ణాలను హేతుబద్ధంగా సవరించాలని వారు కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. నిజానికి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక మన ఊరు - మన బడి కార్యక్రమం అమలులో భాగంగా తెలంగా ణకు చెందిన సోలార్ పారిశ్రామికవేత్తలకు పాఠశాలలలో సోలార్ ప్రాజెక్టుల అమలులో సమాన అవకాశాలు కల్పించబడ్డాయని వారు గుర్తుచేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బుర్ర అశోక్ కుమార్ గౌడ్అ, ధ్యక్షుడు తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ (టీఎస్ ఈఏ) ,శ్రీహరిబాబు జనరల్ సెక్రటరీ , బాబు నాయుడుజాయింట్ సెక్రటరీ, శ్రీని వాస్ కుక్కడపు జాయింట్ సెక్రటరీ, రాజేష్ పరకాలవైస్ ప్రెసిడెంట్, ఈసీ మెంబర్లు బదరి నారాయణ, జాన్ విల్యం, రాఠి తదితరులు

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్,జూన్ 19:**

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్టుఅమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివ ర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభి వృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించత లపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియ రెన్స్ లభించడం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ, ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసు కున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాం తాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ నగరానికి సరికొత్త పర్యా టక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్ష ణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుం దని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి. మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరి వాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# భూ వివాదాలు లేని రాష్ట్రమే లక్ష్యం

**హైదరాబాద్, జూన్ 19 :**

భూ సమస్యలు, భూ వివాదాలు లేని తెలంగాణ ను నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ అధికారులతో శుక్రవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్ట నున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనా ధారమని, ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమ ని వివరించారు. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీసర్వే కార్యక్రమం చరిత్రా త్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలపు సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నా యని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉప సంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందని చెప్పారు. ఈ పరిస్థితుల కు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేపడుతోందని తెలిపారు. నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రా మాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే ఐదు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసా గుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయను న్నట్లు వెల్లడించారు.

**ప్రతి సర్వే నంబర్‌కు భూదార్**

భూముల రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూ కమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికీ ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీ జీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూ జీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా ప్రస్తుతం అవి 2.29 కోట్లకు పెరిగాయని, రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని చెప్పారు. రీ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సు లు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి ఆరుగురు సర్వేయర్లను నియమించినట్లు వివరించారు. రెవెన్యూ గ్రా మాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేష న్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీసర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవం తంగా మారనున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

## మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

**హైదరాబాద్,జూన్ 19:**

మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు క్షమించమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభా రతిలో 'స్కూల్ పిల్లల భద్రత'పై స్కూల్ యాజమాన్యాలు, సంబంధిత శాఖలతో ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిటీ పరిధిలో 3500లకు పైగా స్కూల్స్ ఉన్నాయని, వీటిలో 12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్వి రాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్ మ్యా ప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యా జమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు. స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్స్‌పై నిఘా ఉంచాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ వా లంటీర్లు, మార్షల్స్‌ను విద్యాసంస్థలు నియ మించుకోవాలని అన్నారు. పిల్లలు తెలిసీ తెలియక నేరాల్లో ఇన్వాల్వ్ అవుతున్నార ని.. పిల్లలపై టీచర్స్, పేరెంట్స్ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్కూల్ పరిసరా ల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని, అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 45 మంది విద్యార్థులు యాక్సిడెంట్లో చని పోతున్నారని, యాక్సిడెంట్లు మర్డర్ల కంటే ప్రమాదకరమన్నారు. అందుకే స్కూల్ వి ద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

## అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

**హైదరాబాద్, జూన్ 19:**

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న అల్లు అర్జున్‌తో పాటు ఇతర నిందితులు కూడా సోమవారం నాడు వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని న్యాయ స్థానం ఆదేశించింది. 'పుష్ప2' సినిమా ప్రీమియర్ ప్రదర్శన సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు సుదీర్ఘ దర్యాప్తు చేపట్టి అల్లు అర్జున్‌ను ఏ11గా పేర్కొంటూ ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.

ఈ కేసులో మొత్తం 23 మందిని నిందితు లుగా చేర్చిన పోలీసులు, సంధ్య థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులను ప్రధాన నిందితులుగా పేర్కొన్నారు. దాఖలైన ఛార్జ్ షీట్‌ను పరిశీలించిన నాంపల్లి కోర్టు విచారణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తూ అల్లు అర్జున్‌తో పాటు మరో 19 మందికి సమన్లు జారీ చేసింది.

ప్రీమియర్ ప్రదర్శన రోజున అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడం, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్ల తొక్కి సలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, పలువురు గాయ పడ్డారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తేం దుకు, నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరో పణలపై నమోదైన ఈ కేసు ప్రస్తుతం కోర్టు విచారణ దశకు చేరుకుంది. తాజా సమన్ల నేపథ్యంలో అల్లు అర్జున్ సహా నిందితులు సోమవారం కోర్టుకు హాజరవుతారా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## ఫేక్ ఐడీలతో యువతులకు టోకరా

**మెదక్, జూన్ 19:**

సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు సృష్టించి యువతులను మోసం చేసిన ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో వెలుగుచూసింది. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి ఇద్దరు యువతుల నుంచి లక్షల రూపాయలు, బంగారం కాజేసిన యువకు డిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్థానికుల కథనం ప్రకారం ఎల్లంపల్లి గ్రామా నికి చెందిన ఉప్పరి దుర్గయ్య ఇన్‌స్టాగ్రామ్‌లో తన పేరును రిత్విక్ రెడ్డిగా మార్చుకుని అదే గ్రామానికి చెందిన ఓ యువతికి స్నేహ అభ్యర్థన పంపించాడు. ఆమె అంగీకరించిన తర్వాత తాను ఛత్తీస్‌గఢ్‌లో ఐపీఎస్ శిక్షణ పొందుతున్నానని నమ్మించాడు.

పెళ్లి చేసుకుంటానని హామీ ఇస్తూ ఖర్చుల కోసం డబ్బులు కావాలని చెప్పి యువతి నుంచి రూ.5 లక్షలతో పాటు తులం బంగారు కమ్మలను తీసుకున్నట్లు ఆరోపణ లు ఉన్నాయి.

అంతటితో ఆగకుండా మరో నకిలీ ఖాతా సృష్టించి సాత్విక్ రెడ్డి పేరుతో ఏ క్లాస్ పూర్ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికకు స్నేహ అభ్యర్థన పంపాడు. ఆమెతో పరిచయం పెంచుకుని తాను ఎంబీబీఎస్ చదువు తున్నానని చెప్పి, విద్యా ఖర్చుల పేరుతో విడతల వారీగా రూ.7 లక్షలు తీసుకున్నట్లు సమాచారం.

డబ్బులు తీసుకున్న అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడంతో ఇద్దరు బాధితులు మోసపోయినట్లు గుర్తిం చారు. అనంతరం టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈ ఘటన కొంత ఆలస్యంగా వెలుగులోకి రావడంతో స్థానికంగా చర్చనీయాంశమైం ది. సామాజిక మాధ్యమాల్లో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



## క్షయ రహిత రాష్ట్రమే లక్ష్యం

- **వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్**

**హైదరాబాద్, జూన్ 19 :**

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను రాష్ట్రంలో 2,492 గ్రామాల్లో హెల్త్ స్క్రీనింగ్‌లు నిర్వ హిస్తున్నామని, క్షయ వ్యాధి రహిత రాష్ట్రం గా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రు లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నా రు. దేశంలో క్షయ, మాతా□శిశు సంరక్షణ, నివారణ కార్యక్రమాలపై ఈ వీడియో కాన్ఫ రెన్స్‌ను నిర్వహించారు. క్షయ నిర్ధారణ పరీక్షలు (ఎక్స్‌రే, తెమడ పరీక్షలు) అను మానితులందరికీ నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్సతోపాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రతి నెలా రూ.వెయ్యి నిక్షయ పోషణ యోజన కింద అందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా తెలిపారు. రాష్ట్రంలో పౌష్టికాహారం కోసం ఫుడ్ బాస్కెట్‌లను బాధితులకు అం దిస్తున్నామని, క్షయ వ్యాధి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి దామోదర్ అన్నారు. రాష్ట్రంలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మాతృ మరణాల ను, నవజాత శిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టామన్నారు.



# సమగ్ర పంటల విధానమే పరిష్కారం!

దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్‌ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్‌ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు. అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి. ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ఃాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# మళ్లీ రగిలిన పశ్చిమాసియా



## లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

## కాల్పుల విరమణకు ఎదురుదెబ్బ

## శాంతి చర్చలపై అనిశ్చితి

**బీరూట్, జూన్ 19 :** ఇరాన్-అమెరికా మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొద్ది గంటల్లోనే పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి. దక్షిణ లెబనాన్ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు లెబనాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దీంతో ప్రాంతీయ పరిస్థితులు మరోసారి ఆందోళనకరంగా మారాయి. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఆ ప్రాంతంలో తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయని పేర్కొంది. కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన వెంటనే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇరాన్--అమెరికా మధ్య కుదిరిన తాజా అవగాహన ప్రకారం లెబనాన్‌తో పాటు సంబంధిత ప్రాంతాల్లో సైనిక చర్యలు నిలిపివేయాల్సి ఉంది. అలాగే లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సిన బాధ్యత అన్ని పక్షాలపై ఉంటుంది. అయితే తాజా దాడులతో ఆ ఒప్పంద భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మాత్రం హెజ్బొల్లా నుంచి ముప్పు పూర్తిగా తొలగే వరకు సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. భద్రతా అంశాల్లో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన ఇరాన్--అమెరికా తదుపరి చర్చలు వాయిదా పడ్డాయి. శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా తన స్విట్జర్లాండ్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అధికారికంగా సాంకేతిక కారణాలనే చెబుతున్నప్పటికీ, తాజా పరిణామాల ప్రభావమే దీనికి కారణమని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుందన్న ఆశలు వ్యక్తమయ్యాయి. అయితే లెబనాన్‌లో కొనసాగుతున్న తాజా దాడులు ఆ ఆశలకు గండికొట్టాయి. పరిస్థితులు మరింత దిగజారితే ప్రాంతీయ స్థిరత్వంతో పాటు శాంతి ప్రయత్నాలపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# నీట్ పరీక్షకు అత్యాచార నిందితుడికి బెయిల్

- నాలుగు రోజుల తాత్కాలిక అనుమతి
- పరీక్ష రాసేందుకు కోర్టు అవకాశం
- కఠిన షరతులతో మంజూరు

**ముంబై, జూన్ 19 :** అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న 18 ఏళ్ల యువకుడికి నీట్ ప్రవేశ పరీక్ష రాసేందుకు ముంబై ప్రత్యేక పోక్సో న్యాయస్థానం నాలుగు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. జూన్ 21న జరగనున్న నీట్ పునఃపరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పిస్తూ న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. జూన్ 18 నుంచి 21 వరకు బెయిల్‌పై విడుదల చేసి, జూన్ 22 మధ్యాహ్నం 2 గంటలలోపు తిరిగి జైలులో లొంగిపోవాలని ఆదేశించింది. ప్రస్తుతం నవీ ముంబైలోని తలోజా కేంద్ర కారాగారంలో ఉన్న ఈ యువకుడిపై భారతీయ న్యాయ సంహిత కింద అత్యాచారం కేసుతో పాటు చిన్నారుల రక్షణ చట్టంలోని పలు నిబంధనల కింద అభియోగాలు నమోదయ్యాయి. బెయిల్ అభ్యర్థనపై విచారణ సందర్భంగా బాధితురాలు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని న్యాయస్థానానికి తెలియజేసింది. అయితే తనను లేదా తన కుటుంబ సభ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ బెదిరించకూడదని షరతు విధించాలని కోరింది. నిందితుడి తరఫు న్యాయవాది వాదిస్తూ, విద్యను కొనసాగించే అవకాశం కల్పించడం పునరావాస ప్రక్రియలో భాగమని తెలిపారు. వైద్య విద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు యువకుడికి అవకాశం ఇవ్వాలని కోరారు. పరీక్షకు సిద్ధమయ్యేందుకు కొంత సమయం అవసరమని, పోలీసుల భద్రత మధ్య పరీక్ష రాయాల్సి వస్తే మానసికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. మరోవైపు ప్రభుత్వ తరఫు న్యాయవాది ఈ అభ్యర్థనను తీవ్రంగా వ్యతిరేకించారు. నిందితుడిపై ఉన్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొన్నారు. అవసరమైతే ఒక్కరోజు మాత్రమే పోలీసుల పర్యవేక్షణలో పరీక్ష రాసేందుకు అనుమతించాలని సూచించారు. అయితే పూర్తి స్థాయి తాత్కాలిక బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ప్రత్యేక న్యాయమూర్తి ఎస్.ఆర్. శర్మ, నిందితుడి ఉన్నత పాఠశాల అర్హత పత్రం, నీట్ ప్రవేశ పత్రాన్ని పరిశీలించారు. విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక బెయిల్ ఇవ్వడానికి తగిన కారణాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అభియోగ పక్షం వ్యక్తం చేసిన ఆందోళనలను కఠినమైన షరతుల ద్వారా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం పలు నిబంధనలు విధించింది. బాధితురాలిని ఎట్టి పరిస్థితుల్లోనూ సంప్రదించకూడదని, సాక్ష్యాలను ప్రభావితం చేయకూడదని, కేసుకు సంబంధించిన ఎవరినీ ప్రలోభపెట్టడం లేదా బెదిరించడం చేయకూడదని స్పష్టం చేసింది. అలాగే నీట్ పరీక్ష రాసినట్లు ధ్రువీకరణ పత్రాలను జైలులో లొంగిపోయే సమయంలో సమర్పించాలని ఆదేశించింది. రూ.50 వేల పూచీకత్తుతో ఈ తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది.







# పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

## వాట్సాప్ ద్వారా సచారం తెలుసుకునే వీలు

## నీట్ విద్యార్థులకు ఎన్‌టిఎ కీలక సమాచారం



**న్యూఢిల్లీ, జూన్ 19:** నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్‌టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్‌టీఏ నుంచి ఎస్‌ఎమ్‌ఎస్, ఈ-మెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డ్‌లను అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. నీట్ 2026 అభ్యర్థుల కోసం ఎన్‌టీఏ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జూన్ 21 ఆదివారం జరగబోయే నీట్ రీ-ఎగ్జామినేషన్ సమాచారం ఇకపై నేరుగా వాట్సాప్ ద్వారా అభ్యర్థులకు అందనుంది. 91- 78279 80287 నంబర్ నుంచి మాత్రమే అధికారిక సమాచారం వస్తుందని ఎన్‌టీఏ వెల్లడించింది. బ్లూ టిక్ లేని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని విద్యార్థులను హెచ్చరించింది.

# రాహుల్‌కు ప్రధాని శుభాకాంక్షలు



- జన్మదినం సందర్భంగా సందేశం
- ప్రముఖుల నుంచి అభినందనల వెల్లువ
- ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్ష

**న్యూఢిల్లీ, జూన్ 19 :** పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం జీవించాలని ఆకాంక్షిస్తూ సామాజిక మాధ్యమ వేదికలో సందేశం విడుదల చేశారు. దేశ ప్రజల సేవలో మరింత కాలం కొనసాగాలని కోరుకున్నారు. నేడు 56వ ఏటలోకి అడుగుపెట్టిన రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయి. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, పేదలకు ఆహార పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల కోసం సాగిస్తున్న పోరాటం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రాహుల్ గాంధీకి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర మరింత విస్తరించాలని, దేశ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు కూడా తమ సందేశాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ 1970 జూన్ 19న ఢిల్లీలోని హోలీ ఫ్యామిలీ ఆసుపత్రిలో జన్మించారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ, మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కుటుంబ వారసుడిగా రాజకీయాల్లో ప్రవేశించిన ఆయన, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగా ఎదిగారు. ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగుతున్న రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రజా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. ఆయన జన్మదినం సందర్భంగా దేశ నలుమూలల నుంచి అభినందనలు వెల్లువెత్తుతుండగా, ప్రజాసేవలో మరింత కాలం కొనసాగాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.




# ఆత్మీయుల సమక్షంలో ముత్యాల యాదగిరి జన్మదిన వేడుకలు

**ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జె.కె శేఖర్ యాదవ్, జగద్గిరిగుట్ట 126 డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ జెల్ల.మహేష్ యాదవ్**

**కుత్బుల్లాపూర్, రాజముద్ర న్యూస్ :** జాతీయ యాదవ్ హక్కుల పోరాట సమితి కుత్బుల్లాపూర్ యూత్ ప్రధాన కార్యదర్శి ముత్యాల యాదగిరి జన్మదిన వేడుకలు గురువారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి.ఈ వేడుకకు కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జె.కె శేఖర్ యాదవ్, జగద్గిరిగుట్ట 126 డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ జెల్ల మహేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అఖిలభారత మహాసభ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్, జగద్గిరిగుట్ట శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ అధ్యక్షుడు గండిరాజు యాదవ్, నాగరాజు యాదవ్, ఉపాధ్యక్షుడు సాయికిరణ్ యాదవ్, రాధాగోపాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కురుమయ్య యాదవ్, శ్రీకాంత్ యాదవ్, శేరిలింగంపల్లి రాజముద్ర తెలుగు దినపత్రిక రిపోర్టర్ పరమేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. అతిథులంతా ముత్యాల యాదగిరికి కేక్ కట్ చేయించి, పుష్పగుచ్చాలు అందించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బరిగెల నరేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# కొత్త కొత్తూరు: వర్షా కాలం ముందస్తు చర్యలు.. కాలువల పూడికతీత

**గ్రామపంచాయతీలో సైడ్ కాలువల పూడిక తొలగింపు.. సర్పంచ్ కవిత పర్యవేక్షణ**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని సైడ్ కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ మాలోత్ కవిత, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీ భవాని, గ్రామపంచాయతీ కార్యదర్శి రవి, వార్డ్ మెంబర్ బొల్లగాని వెంకటరామారావు, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు. వర్షాల సమయంలో కాలువలు పొంగి ఇళ్లలోకి నీరు రాకుండా, దోమల బెడద లేకుండా ముందస్తుగా పూడిక తొలగిస్తున్నామని సర్పంచ్ కవిత తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో కాలువల శుభ్రత పనులు కొనసాగుతాయని పంచాయతీ అధికారులు వెల్లడించారు.

# మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పంగ హరిబాబు



**నాగారం,రాజముద్ర న్యూస్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ గా నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ హరిబాబుని ఎన్నుకోవడం జరిగింది. ఈ శుభ సందర్భంలో నాగారం డివిజన్ లోని సాయి సంజీవ నగర్ కాలనీ అధ్యక్షుడు ఎన్.విజయ్, జనరల్ సెక్రెటరీ ధనుంజయ్,ట్రెజరర్ లక్ష్మీ ప్రసాద్,చందన్ కుమార్, సత్యదేవ్,రఘు, ప్రశాంత్, సందీప్, తిరుమలేష్, కాలనీవాసులు కలసి శాల్వతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# నేలకొండపల్లి లో ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు..

- ఓటు తొలగింపు అపోహలు వద్దు: బీజేపీ
- బీఎల్ఓలకు పూర్తి సహకారం అందిస్తాం: బీజేపీ మండల అధ్యక్షులు సుధాకర్



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్, బీజేపీ మండల నాయకులు, బీఎల్ఏ-2లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ, ఓటు విషయంలో ఓటర్లు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. ఈ ఎస్ఐఆర్ కార్యక్రమం అనేది ఎవరి ఓటు తీసివేయడానికి కాదని, ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. 2002 ఓటర్ లిస్ట్ మరియు ప్రస్తుత ఓటర్ లిస్ట్ ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియకొనసాగుతుందని తెలిపారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై బీజేపీ నేలకొండపల్లి బీఎల్ఏ-2లు పూర్తి స్థాయిలో బూత్ లెవెల్ ఆఫీసర్లకు బూత్‌ల వారీగా సహకరిస్తారని సుధాకర్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణలో ప్రజలకు అవగాహన కల్పించి సహాయం చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్, నాయకులు షేక్ షర్ఫుద్దీన్, సయ్యద్ మోహినుద్దీన్, ఎలిగేటి గిరి, కందరబోయిన గోపి, దేశబోయిన వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యారంగం: సంక్షోభం నుండి సంస్కారం వైపు

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** విద్య దీపం వంటిది. అది వెలిగితేనే సమాజం ముందుకు నడుస్తుంది. తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు నాణ్యమైన విద్య కూడా ప్రధాన ఆకాంక్ష. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజుల నియంత్రణ, ప్రభుత్వ బడుల బలోపేతం వంటి హామీలతో ప్రజల్లో ఆశలు రేకెత్తాయి. కానీ ఆ హామీలు ఇంకా పూర్తి స్థాయిలో అమలు కాలేదనే ఆవేదన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది.




**ప్రస్తుత పరిస్థితి: రెండు లోకాలు**

ఈరోజు తెలంగాణలో విద్యారంగం రెండు లోకాలుగా విడిపోయింది. ఒకవైపు లక్షల ఫీజులతో కార్పొరేట్ కళాశాలలు. మరోవైపు కనీస వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలు. పేద విద్యార్థి ఎటు వెళ్లాలో తెలియని అయోమయం.

**ప్రధాన సమస్యలు**

.ఫీజుల భారం: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు ఏటా 10 నుండి 20 శాతం పెరుగుతున్నాయి. 25 శాతం ఫీజు తగ్గింపు హామీ ఇంకా అమలు కాలేదు. ఒక పేరుతో అనుమతి తీసుకుని మరో బ్రాండ్ పేరుతో నడిపే సంస్థలు తల్లిదండ్రులను గందరగోళానికి గురి చేస్తున్నాయి.

**ప్రభుత్వ బడుల నిర్లక్ష్యం:**

రాష్ట్రంలో వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో ఉపాధ్యాయుడు 3, 4 తరగతులకు పాఠాలు చెప్పాల్సి వస్తోంది. చాలా బడుల్లో మరుగుదొడ్లు లేవు, తాగునీరు లేదు, కంప్యూటర్ ల్యాబ్ అనేది కలగానే మిగిలింది. ఫలితంగా ప్రభుత్వ బడులపై నమ్మకం సన్నగిల్లుతోంది.

**రూ.10,300 కోట్ల పెండింగ్ బకాయిలు**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. పై చదువులకు, ఉద్యోగాలకు వెళ్లాలంటే సర్టిఫికెట్ తప్పనిసరి. ఈ చక్రంలో వేల మంది భవిష్యత్తు ఆగిపోయింది.

**గురుకులాల్లో నాణ్యతా లోపం:**

గురుకులాలు, హాస్టళ్లు పేద విద్యార్థులకు ఆశాదీపాలు. కానీ అద్దె భవనాల్లో, నాణ్యత లేని భోజనంతో నడుస్తున్న చోట్ల ఫుడ్ పాయిజన్ కేసులు పెరుగుతున్నాయి. విద్యతో పాటు విద్యార్థి ఆరోగ్యం కూడా ప్రభుత్వ బాధ్యత.

**పర్యవేక్షణ వైఫల్యం:**

ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నా కఠిన చర్యలు లేవు. అదే సంస్థలకు మళ్లీ అనుమతులు ఇవ్వడం విమర్శలకు కారణమవుతోంది. విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం తగ్గింది.

**పరిణామాలు**

ఈ పరిస్థితి వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. చదువు మానేసే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ బడులకు దూరంగా ప్రైవేటు బస్సులు ఊరూరా తిరుగుతూ పిల్లల్ని తీసుకెళ్తున్నాయి. ఇది ప్రభుత్వ విద్యావ్యవస్థను మరింత బలహీనం చేస్తోంది.

**పరిష్కార దిశగా ఐదు మెట్లు**

ఫీజుల నియంత్రణ చట్టం: వెంటనే చట్టం చేసి ప్రతి జిల్లాలో రెగ్యులేటరీ కమిటీ వేయాలి. ఆ కమిటీయే ఫీజులు నిర్ణయించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దు చేయాలి. ప్రభుత్వ బడికి ప్రాణం: మన ఊరు మన బడి కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. ఖాళీ పోస్టులను 6 నెలల్లో భర్తీ చేయాలి. ప్రతి ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూమ్, ల్యాబ్, లైబ్రరీ తప్పనిసరి చేయాలి. బకాయిలు విడుదల: రూ.10,300 కోట్లను విడతల వారీగా విడుదల చేసి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందేలా చూడాలి. భవిష్యత్తులో ప్రతి ఏటా బడ్జెట్‌లోనే నిధులు కేటాయించి ఆలస్యం లేకుండా ఇవ్వాలి. గురుకులాలకు భరోసా: అన్ని గురుకులాలకు 3 ఏళ్లలో సొంత భవనాలు కట్టాలి. భోజన నాణ్యతపై థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలి. విద్యార్థుల ఆరోగ్య కార్డు పెట్టి ప్రతి నెల వైద్య పరీక్షలు చేయాలి. జవాబుదారీతనం: విద్యాశాఖ మంత్రి నుండి MEO వరకు ప్రతి ఒక్కరూ నెలకు 10 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. అక్రమ కళాశాలలపై క్రిమినల్ కేసులు పెట్టాలి. విద్యార్థుల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి 48 గంటల్లో స్పందించాలి.

**ముగింపు**

విద్య అనేది ఖర్చు కాదు, పెట్టుబడి. ఈరోజు ఒక విద్యార్థి కోసం పెట్టే ప్రతి రూపాయి రేపు రాష్ట్రానికి వంద రూపాయలు తిరిగి ఇస్తుంది. తెలంగాణ విద్యారంగం సంక్షోభంలో ఉందన్న మాట వాస్తవం. కానీ అదే సమయంలో ఇది ఒక అవకాశం కూడా. ప్రభుత్వం చిత్తశుద్ధితో హామీలను అమలు చేస్తే, అధికారులు బాధ్యతగా పని చేస్తే, సమాజం ప్రభుత్వ బడిని కాపాడుకుంటే తెలంగాణ విద్యారంగం మళ్లీ దేశానికి దిక్సూచి అవుతుంది. చదువు పేదవాడి ఆయుధం. ఆ ఆయుధానికి పదును పెట్టడం మనందరి పని.

- ఎల్లుట్ల సైదులు...
రాజముద్ర పత్రిక.. ఖమ్మం రిపోర్టర్

# వర్షా కాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**నవాబుపేట్ మండల వైద్యాధికారి రోహిత్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నవాబుపెట్ మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్ అన్నారు. శుక్రవారం నవాబుపేట్ మండల పరిధిలోని ఎత్ రాజ్ పల్లి గ్రామంలో పలు ఇండ్లలోని పరిసరాలను పరిశీలించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు, పరిసరాల అపరిశుభ్రత కారణంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, విరేచనాలు వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా మరిగించిన లేదా శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్య సేవలు పొందాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలంతా జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అక్షరాభ్యాసం

**ఎంఈఓ ఆనందరావు**



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలోసామూహిక అక్షరాభ్యాస కార్యక్రమము లో భాగంగా పాఠశాలలో చేరిన ప్రీ ప్రైమరీ , ఒకటవ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం ఎంఈఓఆనందరావు నిర్వహించడంజరిగింది.కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాధికారి,గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం అంగన్వాడి , అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నషా ముక్త్ భారత్ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శారద**



**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, రాజముద్ర న్యూస్:** భారత ప్రభుత్వం చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శారద నషా ముక్త్ భారత్ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత, కుటుంబ,సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శారద మాట్లాడుతూ.. నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు, ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని పిలుపునిచ్చారు.

## పాత పద్ధతిలో యూరియా రైతులకు పంపిణీ చేయాలి

**బిఆర్ఎస్ నాయకుల ధర్నా**



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలో రైతు ప్రభుత్వమని చెప్పుకునే ప్రభుత్వానికి నిరసనగా నూతనంగా మసాలా యాప్ ఎత్తివేసి పాస్ బుక్కుల ద్వారా పాత పద్ధతిలో రైతులకు సరిపడా మసాలా అందించాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ ఆదేశానుసారంతో రామారెడ్డి మండల మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు టంకరి రవి, మాజీ రైతుబంధు అధ్యక్షులు సిహెచ్ తిరుపతి, వార్డ్ మెంబర్స్ టంకరి రాజేందర్, సుతారి సురేష్, పోతుల లింగారెడ్డి, గోకుల్ తాండ సీనియర్ నాయకులు లింబాద్రి నాయక్, బట్టు ఆనంద్, తెడ్డు దినేష్, మూదం బాలరాజు, బండి రాములు, కనుగొందుల చింటూ, బండి పెంటయ్య, కురుమ బాలమల్లు, మ్యాదరి లింగం, రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ




**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత సూచన మేరకు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎదురుగట్ల సంపత్ గౌడ్, రామారెడ్డి మండల అధ్యక్షుడు మొహమ్మద్ ఫహీం ఆధ్వర్యంలో ఘనంగా బోనాలతో స్వాగతం పలకడం జరిగింది. పార్టీ జెండా పండుగ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు, కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు ఉదయ్ కిరణ్ భారీ సంఖ్యలో తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** శంకరపట్నం మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారి తిరుపతి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలకు పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిహా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గోపగోని బస్వయ్యగౌడ్, కొత్తగట్టు ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి, మాజీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి,పార్టీ నాయకులు కె.పద్మ,ఆడెపు అజయ్, షారుఖ్, కీసర సంపత్, జంపయ్య, శ్రీకాంత్,వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నాహాలు

**వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వెంకటాచారి తెలిపారు. స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఇంటింటి సర్వే) పై హైదరాబాదు నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకాలు, బూతు స్థాయి అధికారులకు శిక్షణ, బిఎల్ఓ కిట్లు, ప్రచార సామాగ్రి పంపిణీ తదితర అంశాలపై ఎన్నికల ప్రధాన అధికారి సమీక్షించారు. ఈ నెల 25 నుండి నిర్వహించే ఇంటింటి సర్వే కు సంబంధించి జిల్లాలో 1133 మంది బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని ఎన్నికల ప్రధాన అధికారికి జిల్లా అదనపు కలెక్టర్ కె. వెంకటాచారి తెలిపారు. ఇప్పటికే ఎస్ఐఆర్ ప్రక్రియపై నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఫోటోలు, మినిట్స్ నోట్ చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. మరో మారు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పూర్తిస్థాయి బూతు స్థాయి ఏజెంట్ల నియామకంపై వివరిస్తామని ఆయన తెలిపారు. జిల్లాకు సరఫరా చేసిన బిఎల్ఓ కిట్లు, ప్రచార సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ఓ లకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ఎన్నికల ప్రధాన అధికారికి తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత, హెచ్– విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీ భవన్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**డాక్టర్ గడ్డం శ్రీనివాస్,వైస్ చైర్మన్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్**




**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో భావి భారత ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గాంధీభవన్ లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ గడ్డం శ్రీనివాస్ హాజరై జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ గడ్డం శ్రీనివాస్మా ట్లాడుతూ.. రాహుల్ గాంధీ దేశ యువత, రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజానాయకుడని పేర్కొన్నారు. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పరితపించే రాహుల్ గాంధీ దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ.. కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.

## నీరు నిలిచిపోయే ప్రాంతాలను తనిఖీ చేసిన కమిషనర్





**కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్**

**నాగారం, రాజముద్ర న్యూస్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్, ఘట్కేసర్ సర్కిల్ లోని వివిధ ప్రాంతాల్లో కాలనీలలో వర్షా కాలంలో నీరు నిలిచిపోయే ప్రాంతాలను విస్తృతంగా తనిఖీ చేసి, కొనసాగుతున్న వర్షపునీటి నిర్వహణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ లోని రాంపల్లి ఎక్స్ రోడ్ వద్ద నీరు నిలిచిపోయే ప్రాంతాన్ని ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్త నిఖీ చేసి, వర్షపునీటిని సులభంగా మళ్లించడానికి, భారీ వర్షాల సమయంలో ముంపును నివారించడానికి బాక్స్ డ్రెయిన్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని హెచ్ఎండిఏ అధికారులను ఆదేశించారు. అలాగే ఆవుషాపూర్, పోచారం లోని అరుంధతి కాలని, హిమగిరి కాలని,ఎన్ .టి. పి.సి. ఎక్స్ రోడ్,స్వర్ణగిరి కాలని, జోడిమెట్ల ఎక్స్ రోడ్, ఘట్కేసర్ లోని బుగ్గ నగర్ కల్వర్ట్ వద్ద నీరు నిలిచిపోయే అవకాశం ఉన్న ప్రాంతాలను, కూడా తనిఖీ చేసి, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీమతి ఎ. వాణి రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేష్ కుమార్,హైడ్రా జోనల్ ఇంచార్జ్ మోహన్ రావు, హెచ్.యం.డి.ఎ. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీ శివారెడ్డి,ఘట్కేసర్ సర్కిల్ అసిస్టెంట్ ఇంజనీర్ రవి కిరణ్,విశేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలకు చిన్నారులను పంపాలి



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు–1 అంగన్వాడి కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణ ఆధ్వర్యంలో 'అమ్మ మాట–అంగన్వాడి బడిబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులు ఆటపాటల ద్వారా విద్యను అభ్యసించడంతో పాటు మానసిక, శారీరక వికాసం సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



## ఆగిపోయిన ల్యాబ్ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి

**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన ల్యాబ్ నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారులు అశోక్ రెడ్డి, శ్రీనివాస్ గుత్తేదారును ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ప్రత్యేక ఆదేశాల మేరకు గురువారం పాఠశాలను సందర్శించిన అధికారులు ల్యాబ్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుని నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచనలు చేశారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో మాట్లాడి బోధన ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల విద్యా ప్రగతిపై పలు సూచనలు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలను చేపట్టాలని సూచించారు.



## 2027 వన్డే ప్రపంచకప్‌లో ఇషాన్ ఖాయం: గవాస్కర్

అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో 125 పరుగులతో చెలరేగిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌పై క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ప్రస్తుత ఫామ్ చూస్తుంటే వన్డే ప్రపంచకప్ 2027 కోసం ఇషాన్‌కు అప్పుడే దక్షిణాఫ్రికా వీసా దొరికినట్లు అనిపిస్తోందని, అతడిని జట్టు నుంచి తప్పించడం అసాధ్యమని గవాస్కర్ జోస్యం చెప్పారు. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ సైతం ఇషాన్ బ్యాటింగ్ శైలిని కొనియాడాడు. టీమిండియా వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ .. ఇటీవల దుమ్మురేపుతున్నాడు. ఐపీఎల్ 2025లో అద్భుత ప్రదర్శనతో టీమిండియా తరఫున కమ్‌బ్యాక్ ఇచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్.. ప్రస్తుతం భారత జట్టులో కీలక ఆటగాడిగా మారిపోయాడు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడు. తాజాగా అఫ్ఘానిస్థాన్‌తో రెండో వన్డేలో మెరుపు శతకంతో సత్తాచాటాడు. దీంతో జట్టు నుంచి అతడిని తప్పించలేని పరిస్థితి తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో ఇదే విషయంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాట్లాడారు. ఇషాన్ కిషన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ 2027లో తప్పకుండా ఆడతాడని జోస్యం చెప్పారు. నాకు తెలిసి ఇషాన్ కిషన్‌కు ఇప్పటికే దక్షిణాఫ్రికా వీసా (వన్డే ప్రపంచకప్ 2027 కోసం) వచ్చి ఉంటుందని అనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అతడిని జట్టు నుంచి తప్పించాలంటే మరో ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన చేయాల్సిందే. టీ20 ఫార్మాట్‌లో ఇషాన్ జట్టుకు ఎంతో కీలకమైన ఆటగాడు. పైగా చక్కగా రాణిస్తున్నాడు. షాట్లు అద్భుతంగా ఆడుతున్నాడు. డిఫెన్స్ కూడా బాగుంది. బంతి షార్ట్‌గా వస్తే.. వెంటనే వెనక్కి జరిగి సిక్సర్లు కొడతాడు. గత ఏడాదిన్నర కాలంలో ఇషాన్ సంపూర్ణ ఆటగాడిగా మారిపోయాడు" అని సునీల్ గవాస్కర్ అన్నారు. మరోవైపు ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా ఇషాన్ కిషన్.. బ్యాటింగ్‌కు ఫిదా అయిపోయాడు. ఫార్మాట్, ఆడే పొజిషన్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడని చెప్పుకొచ్చాడు. అతడు టీమిండియా తరఫున ఆడుతున్నంత కాలం.. ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నది పట్టించుకోకుండా రన్స్ చేస్తాడని కొనియాడాడు. ముఖ్యంగా ఇషాన్ ఎక్స్‌ట్రా కవర్ మీదుగా కొట్టే షాట్లు తనకు ఎంతో ఇష్టమని గ్రేమ్ స్వాన్ వ్యాఖ్యానించాడు. కాగా అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో ఇషాన్ కిషన్.. 79 బంతుల్లో 125 పరుగులు చేశాడు. హాఫ్ సెంచరీ చేసేందుకు 52 బంతులు తీసుకున్న అతడు.. తర్వాత టాప్ గేర్‌లోకి వచ్చాడు. మరో 19 బంతులకే సెంచరీ మార్కును అందుకుని ఔరా అనిపించాడు.

# టీమ్ ఇండియాకు ధోని లాంటి మెంటార్ కావాలి!



భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ లక్ష్యంగా మాజీ పేసర్ ఎస్. శ్రీశాంత్ చేసిన కొన్ని ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం ఉన్న టీమ్ ఇండియా సెటప్‌కు గౌతమ్ గంభీర్ కంటే ఎంఎస్ ధోని లాంటి వ్యక్తి అవసరమని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు. టీమ్ ఇండియాకు ప్రస్తుతం ఆటగాళ్లు మనస్ఫూర్తిగా గౌరవించే ఒక మార్గదర్శకుడు కావాలని, అంతేగానీ "ఆటగాళ్ల వెనుక మాట్లాడేవాడు" లేదా టీవీల్లో ప్రశంసల కోసం ప్రాకులాడే వ్యక్తి కాదని గంభీర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కాగా, ఈ పూర్తి ఇంటర్వ్యూ ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్, సౌతాఫ్రికా వంటి జట్లతో స్వదేశంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భారత్ ఎందుకు ఇబ్బంది పడిందనే ప్రశ్న శ్రీశాంత్‌కు ఎదురవగా.. ఆ ప్రశ్నను మధ్యలోనే అడ్డుకుంటూ.. "అప్పుడు కోచ్ ఎవరు?" అని ఎదురుప్రశ్న వేశాడు. ఆటగాళ్ల ఎంపికకు సంబంధించిన సమస్యలపై స్పందిస్తూ.. దీనికంతటికీ గంభీరే కారణమన్నట్లుగా మాట్లాడాడు. "ముందు కోచ్‌ను మార్చండి. భారత్‌కు ఇప్పుడు కావాల్సింది కోచ్ కాదు, ఒక మంచి మెంటార్" అని శ్రీశాంత్ స్పష్టం చేశాడు. ఒక షో సజావుగా సాగడానికి డైరెక్టర్ ఎంత ముఖ్యమో, జట్టుకు కోచ్ కూడా అంతే ముఖ్యమని చెబుతూనే.. తనకు సాధారణంగా కోచ్‌లపై ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ అంతర్జాతీయ జట్లకు సాంప్రదాయ కోచ్‌ల కంటే మెంటార్ల అవసరమే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. గంభీర్ అనుసరిస్తున్న కోచింగ్ విధానం ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోందని శ్రీశాంత్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఫెయిల్ అయితే జట్టు నుంచి తీసేస్తామనే భయాన్ని కల్పించి, ఆటగాళ్లను ఒక కఠినమైన వ్యవస్థలోకి నెట్టే కోచ్ జట్టుకు అవసరం లేదని అన్నాడు. దీనికి ఉదాహరణగా ఎంఎస్ ధోనిని ప్రస్తావిస్తూ.. ధోని ఎప్పుడూ అలా వ్యవహరించలేదని చెప్పాడు. "జనాలు ఏమైనా చెప్పుకోవచ్చు.. కానీ ధోని ఆలోచనా విధానం, అతను ఆటగాళ్లలో నింపిన ఆత్మవిశ్వాసమే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాయి" అని శ్రీశాంత్ గుర్తుచేశాడు. భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో గంభీర్‌కు మితిమీరిన క్రెడిట్ ఇవ్వడం సరికాదని శ్రీశాంత్ వాదించాడు. "మైదానంలో చెమటోడ్చి ఆడేది ఆటగాళ్లు, కాబట్టి ఆ గుర్తింపు, క్రెడిట్ వారికే దక్కాలి" అని అన్నాడు. ప్రపంచకప్ విజయాన్ని ప్రస్తావిస్తూ.. ఆటగాళ్ల ప్రదర్శనే అక్కడ అత్యంత కీలకమని చెప్పాడు. "ఒకవేళ సంజూ శాంసన్ రాణించకపోయినా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ సరిగ్గా చేయకపోయినా, లేదా సమయానికి బౌలింగ్ మార్పులు జరగకపోయినా మనం గెలిచేవాళ్లమా? మైదానంలోకి వచ్చి కోచ్ ఏమైనా నిర్ణయాలు తీసుకున్నాడా?" అంటూ శ్రీశాంత్ ఘాటుగా ప్రశ్నించాడు. 2013 స్పాట్ ఫిక్సింగ్‌లో శ్రీశాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ధోని వల్లే శ్రీశాంత్ కెరీర్ నాశనం అయ్యిందంటూ కామెంట్స్ కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు శ్రీశాంత్ ధోనిపై ప్రశంసలు కురిపించడం కాస్త విచిత్రంగానే ఉంది.

# డూప్లెసిస్ 46 బంతుల్లోనే సెంచరీ



మేజర్ లీగ్ 2026లో ఫాఫ్ డుప్లెసిస్ తొలి మ్యాచ్‌లోనే విధ్వంసం సృష్టించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో టెక్సాస్ తరఫున ఆడిన డూప్లెసిస్ గీ6 బంతుల్లోనే సెంచరీ చేశాడు. గీ1 ఏళ్లలో గీ6 బంతుల్లో సెంచరీ చేసిన ఫాఫ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ మేజర్ లీగ్‌లో ఫాఫ్ గీ సెంచరీలతో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో సియాటెల్ ఓపెనర్ టిమ్ సైఫర్ట్ కూడా సెంచరీ చేయడం విశేషం. ఈ మ్యాచ్‌లో టెక్సాస్ ఘన విజయం సాధించింది. ఫాఫ్ డుప్లెసిస్ వావ్ అనిపించే ప్రదర్శన చేశాడు. గీ1 ఏళ్ల వయస్సులో కేవలం గీ6 బంతుల్లోనే సెంచరీ బాది తనలో ఇంకా సత్తా ఉంది అనిపించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్‌కు ఎప్పుడో గుడ్ బై చెప్పిన డుప్లెసిస్.. టీ20 లీగ్‌లలో మాత్రం కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున చివరిసారిగా ఆడిన ఈ లెజెండ్.. ఐపీఎల్ 2026కు ముందు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించాడు. తాజాగా యూఎస్ఏ వేదికగా జరుగుతున్న మేజర్ లీగ్ టీ20లో చెన్నై సూపర్ కింగ్స్‌కి టెక్సాస్ సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. టెక్సాస్‌కి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఫాఫ్ డుప్లెసిస్ మేజర్ లీగ్ 2026 తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాది జట్టుకు మరచిపోలేని విజయాన్ని అందించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో 221 పరుగుల లక్ష్యాన్ని నాటౌట్‌గా నిలిచి ఛేదించాడు. మేజర్ లీగ్‌లో నాలుగు సెంచరీలు నమోదు చేసిన ఫాఫ్, ఈ లీగ్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా నిలిచాడు. డల్లాస్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సియాటెల్ ఆర్కాస్ టెక్సాస్ బౌలర్లను ఉతికారేసింది. న్యూజిలాండ్ స్టార్ హిట్టర్ టిమ్ సైఫర్ట్ బౌండరీల మోత మోగించాడు. 66 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, ఆరు సిక్సర్లతో 10గీ పరుగులు చేయగా.. షయాన్ జహంగీర్ గీ7 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 78 పరుగులు బాదాడు. ఆఖర్లో కెప్టెన్ మార్కస్ స్టొయినిస్ 3 బంతుల్లో 13 పరుగులు చేయడంతో సియాటెల్ 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన రెండో బంతికే వికెట్ కోల్పోయింది. తెలుగు ఆటగాడు సాయితేజ ముక్కమల్ల తాను ఎదుర్కొన్న మొదటి బంతికే డకౌట్ అయ్యాడు. తొలి ఓవర్‌లోనే వికెట్ పడినప్పటికీ ఫాఫ్ డుప్లెసిస్ సియాటెల్ బౌలర్లకు చుక్కలు చూయించాడు. రీలీ రోస్సోతో కలిసి పవర్ ప్లేలోనే 89 పరుగులు రాబట్టాడు. 21 బంతుల్లో 7 ఫోర్లు, రెండు సిక్సర్లతో రోస్సో గీ9 పరుగులు చేసి అవుటయ్యాడు. ఆ వెంటనే మిలింద్ కుమార్, శుభమ్ రంజనే కూడా అవుటవ్వడంతో 165కే నాలుగు వికెట్లు కోల్పోయింది. వియాన్ ముల్దర్‌తో కలిసి ఫాఫ్ డుప్లెసిస్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ని ఫినిష్ చేశాడు. గీ6 బంతుల్లో సెంచరీ చేసిన ఫాఫ్ 52 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సర్లతో 113 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ముల్డర్ కూడా 15 బంతుల్లో మూడు సిక్సర్లతో 31 పరుగులు చేశాడు. దాంతో టెక్సాస్ 18.3 ఓవర్లలోనే 221 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.



## హర్షిత్ రాణా రీ-ఎంట్రీ..!?

ఇండియా ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణాకు సంబంధించిన ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. అఫ్గానిస్తాన్‌తో శనివారం చెన్నైలో జరగబోయే లాస్ట్ వన్డే మ్యాచ్ కోసం అతన్ని ఇండియన్ క్రికెట్ టీమ్ స్క్వాడ్‌లోకి సెలెక్ట్ చేశారు. త్రీ-మ్యాచ్ వన్డే సిరీస్‌లో ఫస్ట్ రెండు మ్యాచ్‌లు గెలిచిన ఇండియా ఆల్రెడీ 2-0 తో సిరీస్ కైవసం చేసుకుంది. ఇప్పుడు క్లీన్‌స్వీప్ టార్గెట్‌గా పెట్టుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆర్మీకి హర్షిత్ రాణా రాక మరింత బలాన్ని ఇచ్చింది. టీ20 వరల్డ్ కప్ 2026 కు ముందు ముంబైలో సౌతాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్ టైమ్‌లో హర్షిత్ మోకాలి గాయానికి గురయ్యాడు. దీంతో ఆ మెగా టోర్నమెంట్‌తో పాటు కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఐపీఎల్ కు కూడా కంప్లీట్‌గా దూరమయ్యాడు. గాయం తర్వాత హర్షిత్ రాణా చాలా రోజులు క్రికెట్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో చేరిన హర్షిత్, అక్కడ తన రిహాబిలిటేషన్‌ను సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ చేసుకున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాత చెన్నై వేదికగా అఫ్గానిస్తాన్‌తో జరిగే మ్యాచ్ కోసం టీమ్‌తో జాయిన్ అయ్యాడు. "బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ పూర్తి చేసుకున్న హర్షిత్ రాణా చెన్నైలో వన్డే స్క్వాడ్‌తో కలిశాడు" అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఒక మీడియా రిలీజ్ లో స్పష్టం చేశారు. 2గీ ఏళ్ల హర్షిత్ రాణా ఇండియా తరఫున ఇప్పటివరకు 1గీ వన్డేలు ఆడి 27.38 యావరేజ్, 6.21 ఎకానమీ రేట్‌తో 16 వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగిన హోమ్ టీ20ఐ సిరీస్‌లో అతను లాస్ట్ టైమ్ ఇండియా జెర్సీలో కనిపించాడు. అయితే గాయం నుంచి కోలుకున్న వెంటనే అతనికి సెలెక్టర్లు వరుస ఛాన్సులు ఇస్తున్నారు. అఫ్గాన్ మ్యాచ్‌తో పాటు రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లలో ఆడే ఇండియా స్క్వాడ్‌లో కూడా హర్షిత్‌కు ప్లేస్ దక్కింది. ఈ రెండు టూర్లలో ఇండియా మొత్తం ఏడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న హర్షిత్ రాణా చేపాక్ పిచ్‌పై ఎలాంటి ఇంపాక్ట్ చూపిస్తాడనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. సిరీస్ ఆల్రెడీ ఇండియా సొంతం అవ్వడంతో లాస్ట్ వన్డేలో బెంచ్ ప్లేయర్లకు ఛాన్స్ ఇచ్చే యోచనలో మేనేజ్మెంట్ ఉంది. చెన్నై మ్యాచ్ కోసం బీసీసీఐ అనౌన్స్ చేసిన అప్‌డేటెడ్ స్క్వాడ్ చూస్తే.. శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే, యశస్వి జైస్వాల్, హర్షిత్ రాణా ఉన్నారు. స్పిన్‌కు సపోర్ట్ చేసే చెన్నై పిచ్‌పై అఫ్గాన్‌ను క్లీన్‌స్వీప్ చేసి సిరీస్‌ను పర్ఫెక్ట్‌గా ముగించాలని టీమిండియా ప్లాన్ చేస్తోంది.

# కెనడా- ఖతార్ మ్యాచ్‌లో తీవ్ర ఉద్రిక్తత!

## మ్యాచ్‌లో ఆటగాళ్ల మధ్య ఘర్షణ





ఫిఫా వరల్డ్?కప్? 2026లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఖతార్??తో జరిగిన మ్యాచ్?లో కెనడా జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్?లో కెనడా 6-0 తేడాతో ఖతార్?ను చిత్తు చేసింది. అయితే మ్యాచ్ అనంతరం మైదానంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుజట్ల ఆటగాళ్లు గ్రౌండ్?లోనే గొడవకు దిగడంతో అక్కడి ప్రాంతం ఒక్కసారిగా హీటెక్కింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఈ ప్రపంచకప్?లో వాంకోవర్ బీసీ ప్లేస్ స్టేడియం వేదికగా తాజాగా కెనడా- ఖతార్ జట్లు తలపడ్డాయి. అయితే మ్యాచ్ ముగిసిన వెంటనే ఇరు జట్ల ఆటగాళ్లు మైదానంలోనే ఘర్షణకు దిగారు. మ్యాచ్ అనంతరం కెనడా హెడ్ కోచ్ జెస్సీ మార్ష్- ఖతార్ మేనేజర్ జూలెన్ లోపెటెగీతో కరచాలనం చేస్తుండగా వాళ్లిద్దరి మధ్య గొడవ మొదలైంది. జూలెన్?తో కెనడా కోచ్ దురుసుగా ప్రవర్తించినట్లు కనిపించింది. ఇది ఖతార్ ఆటగాళ్లకు ఆగ్రహం తెప్పించింది. ఆ తర్వాత ఇరుజట్ల ప్లేయర్లు, సిబ్బంది మైదానంలోనే ఒకరినొకరితో కలపడ్డారు. పరస్పరం నెట్టేసుకున్నారు. వెంటనే భద్రతా సిబ్బంది మైదానంలోకి చేరుకుని ఇరు జట్ల ఆటగాళ్లను విడగొట్టారు. దీంతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే మ్యాచ్? సమయంలోనే ఈ వివాదం మొదలైంది. ఖతార్ ఆటగాడు అసిమ్ మడిబో, కెనడా మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ కోన్‌ను ఆట మధ్యలో గాయపర్చాడు. దీంతో కెనడా జట్టు తీవ్ర ఆగ్రహానికి గురైంది. సెకండ్ హాఫ్? ప్రారంభమైన కొద్ది సేపటికే, అసిమ్ మడిబో చేసిన ప్రమాదకరమైన టాకిల్ వల్ల ఇస్మాయిల్ కోన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడు నొప్పితో విలవిల్లాడాడు. దీంతో అతడిని స్ట్రెచర్‌పై మైదానం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఇస్మాయిల్ కోన్?కు గాయపర్చడం కెనడా తోటి ఆటగాళ్లను కలచివేసింది. ఈ ఆగ్రహమే ఘ-ర్షణకు దారితీసింది. ఇక దీనికి కారణమైన అసిమ్ మడిబోకు రిఫరీ రెడ్ కార్డ్ చూపించి మైదానం నుంచి బయటకు పంపించేశాడు. అసిమ్ మడిబోకు రెడ్ కార్డ్ రావడంతో ఖతార్ 10 మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. దీనిని పూర్తిగా సద్వినియోగం చేసుకున్న కెనడా విజృంభించింది. ఇస్మాయిల్ కోన్ గాయపడడంతో కెనడా జట్టులోకి జాకబ్ షాఫెల్‌బర్గ్ వచ్చాడు. అతడు గోల్ చేసిన అనంతరం ఇస్మాయిల్ జెర్సీని గాలిలో ఊపుతూ సంబరాలు చేసుకున్నాడు. అలాగే కెనడా తరఫున జొనాథన్ డేవిడ్ అద్భుతంగా రాణించాడు. మూడు గోల్స్‌తో హ్యాట్రిక్ సాధించాడు. ఇక ఫీఫా ప్రపంచ కప్ చరిత్రలో కెనడాకు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ విజయంతో కెనడా ప్రస్తుతం నాలుగు పాయింట్లతో ఉంది. గ్రూప్ బీ లో టాప్? ప్లేస్?కు దూసుకెళ్లింది.



# బాలకృష్ణ మూవీలో కాజల్ అగర్వాల్

## ఫస్ట్ లుక్ విడుదల చేసిన మూవీ మేకర్స్

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎన్‌డికె111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. శుక్రవారం హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ-గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. 'భగవంత్ కేసరి' తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. 'భగవంత్ కేసరి'లో కాజల్ పాత్రకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 'ఎన్‌బికె111'లో మాత్రం ఆమె పూర్తి స్థాయి కథానాయికగా, కథను మలుపు తిప్పే కీలక పాత్రలో కనిపించనుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, ఎమోషన్‌ల మేళవింపుగా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది.

# తెలంగాణ ఫోక్ సింగర్ నాగదుర్గకు హీరోయిన్ ఛాన్స్

'కాపోళ్ల ఇంటికాడా', 'పేరుగల్ల పెద్దిరెడ్డి', 'దారి పొంటొొతుండు' వంటి విలక్షణమైన జానపద రీతాలతో, తన అద్భుతమైన నృత్యంతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సొంతం చేసుకున్న ప్రముఖ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గ టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన మార్కు జానపద నృత్యాలతో సెన్సేషన్ సృష్టించిన ఈ తెలంగాణ జానపద కళాకారిణి, ఇప్పుడు ఏకంగా సిల్వర్ స్క్రీన్ పై హీరోయిన్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కి చెందిన 'సుకుమార్ రైటింగ్స్' మరియు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ కి చెందిన 'బన్నీ వాస్ ప్రొడక్షన్స్' సంయుక్తంగా నిర్మిస్తున్న ఒక క్రేజీ ప్రాజెక్టులో నాగదుర్గకు హీరోయిన్‌గా లక్కీ ఛాన్స్ దక్కింది. ఈ సినిమాలో హీరోగా వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి నటించబోతున్నాడు. ఈ సినిమాతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే 'కలివి వనం' అనే ఓ విలక్షణమైన చిత్రంలో నటించిన నాగదుర్గ, ఆ తర్వాత తమిళంలోనూ ఓ క్రేజీ ప్రాజెక్ట్ లో నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లోని మోస్ట్ సక్సెస్‌ఫుల్ బ్యానర్ల నిర్మాణంలో, ప్రియదర్శి సరసన లీడ్ రోల్ పొంది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాగదుర్గ పల్లెటూరి నైపథ్యం, ఆమె సహజ సిద్ధమైన నటన, హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయని తెలుస్తోంది.తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం.



# ధనుష్ తాజా చిత్రం ఓం







తమిళ స్టార్ నటుడు ధనుష్ 55వ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. డి 55గా తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి 'ఓం అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ, మేకర్స్ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు. దట్టమైన అడవులు, కొండల నడుమ సాగే ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఈ గ్లింప్స్ కట్ చేశారు. అమాయక గిరిజనులను సాయుధ బలగాలు చుట్టుముట్టగా, భయంతో ఉన్న వారంతా ఒక్కసారిగా 'అణ్ణా మలైయార్‌కు!' అని నినదించే సీన్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ఆ వెంటనే వర్షం, పొగమంచు మధ్య చేతిలో తుపాకితో ధనుష్ వయలెంట్ అవతారంలో ఎంట్రీ ఇస్తాడు. తుపాకులు పట్టుకున్న బలగాలతో ఒంటిచేత్తో తలపడే యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. ఈ చిత్రాన్ని మేకర్స్ మల్టీ-పార్ట్ సిరీస్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. 'అమ-రన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో 'ఓం'పై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ హీరోయిన్ సాయి పల్లవి, యంగ్ సెన్సేషన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఫస్ట్ స్ట్రయిక్‌లో కేవలం ధనుష్ యాక్షన్ పోర్షన్ మాత్రమే చూపించి, మమ్ముట్టి, సాయి పల్లవి లుక్స్‌ను సస్పెన్స్‌గా ఉంచారు. సాయి పల్లవి ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని టాక్. యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. వండర్‌బార్ ఫిలింస్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# సుమంత్ హీరోగా మహేంద్రగిరి వారాహి

అక్కినేని కంపౌండ్ నుంచి సుమంత్ హీరోగా, ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. భక్తి, పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ అఫీషియల్ టీజర్ విడుదలైన క్రమంలో సోషల్ మీడియాను ఊపేస్తూ, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మహేంద్రగిరి కొండల బ్యాక్‌డ్రాప్‌లో, వరాహి మాత దివ్య శక్తి చుట్టూ అల్లిన కథతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ఆడియన్స్‌ను సరికొత్త లోకంలోకి తీసుకెళ్లింది. అక్కడ జరిగే కొన్ని అంతుచిక్కని సంఘటనలు, భూగర్భంలో దాగి ఉన్న రహస్యాలు, ప్రకృతి సృష్టించే వింతలు ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక తెలియని గంభీరమైన వాతావరణాన్ని, హారర్ ఎలిమెంట్స్‌ని దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా ఎలివేట్ చేశారు. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండటమే కాకుండా, సినిమా కథలో ఏదో ఒక పెద్ద రహస్యమే దాగి ఉందనే క్యూరియాసిటీని ప్రేక్షకుల్లో బలంగా నాటాయి. ఈ సినిమాకు ప్రముఖ సంరీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణంగా నిలిచింది. ఆధ్యాత్మిక శ్లోకాలతో పాటు, థ్రిల్లింగ్ సీన్లను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లేలా ఆయన మ్యూజిక్ అందించారు. ప్రతాప్ ఆర్. కృష్ణ సినిమాటోగ్రఫీ మైండ్ బ్లోయింగ్ అనిపించేలా ఉంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నపూర్ణ స్టూడియోస్ లో శరవేగంగా జరుగుతున్నాయి. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తుండగా, మాళవిక నాయర్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ లాంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.




Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com